'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ట్రంప్ పోటీ ప్రశ్నార్థకం!

**అమెరికా** అధ్యక్ష పదవికి మరోసారి పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్న డొనాల్డ్ ట్రంప్ ఆశలపై కొలరాడో ఉన్నత న్యాయస్థానం తీర్పు నీళ్లు చల్లింది. ట్రంప్ మీద రకరకాల కేసులు నడుస్తున్న సంగతి తెలిసిందే. వాటన్నింటిలోకి అతి కీలకమైంది కాంగ్రెస్ భవనం క్యాపిటోల్‌పై దాడి చేయించడానికి సంబంధించిందని వేరే చెప్పాల్సిన పని లేదు. గత ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంగా ఆయన తన మద్దతుదారులను రెచ్చగొట్టి కాంగ్రెస్ భవనంపై దాడికి ఉసిగొల్పారని ఆరోపణలున్నాయి. ట్రంప్ అభిమానులు దండెత్తి వచ్చి కాంగ్రెస్ ప్రాంగణంలో వీరంగం వేశారు. హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్ స్పీకర్ నాన్సీ పెలోసీ కార్యాలయాన్ని చిందరవందర చేశారు. ఆగంతకులు చుట్టుముట్టడంతో కాంగ్రెస్ సభ్యులు ప్రాణాలు అరచేత పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అగ్రరాజ్యంలో ప్రజాస్వామ్యం దుస్థితి చూసి ప్రపంచం నివ్వెరపోయింది. ప్రత్యర్థి జో బైడెన్ ఎన్నికను అంగీకరించేందుకు నిరాకరించి ఓటర్ల మనోగతాన్ని ట్రంప్ అవమానించారు. తానే గెలిచినట్టుగా ప్రకటించాలని ఒత్తిడి తెచ్చారు. అందులో భాగంగా మద్దతుదారులను దండెత్తి రమ్మని పిలుపునిచ్చారు. దాడిలో అనేకులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో భద్రతా సిబ్బంది, ఆందోళనకారులున్నారు. ఇప్పుడు ఆ దాడే ట్రంప్ కొంప ముంచింది. సాయుధ తిరుగుబాటు చట్టం కింద కొలరాడో న్యాయస్థానం ట్రంప్‌ను ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ప్రకటించింది.

బానిస విధానాన్ని అబ్రహాం లింకన్ రద్దు చేసినప్పుడు అమెరికా ఉత్తర, దక్షిణాలుగా విడిపోయి అంతర్యుద్ధంలో మునిగింది. చివరికి బానిస వ్యవస్థ రద్దును సమర్థించే ఉత్తరాది గెలిచింది. దక్షిణాదివారు ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయ ఆధిపత్యం సాధించి తమకు ఇష్టమైన బానిస విదానాన్ని తిరిగి తెస్తారని భయపడిన అప్పటి శాసనకర్తలు సాయుధ తిరుగుబాటు చట్టాన్ని తెచ్చారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థపై సాయుధ తిరుగుబాటును రెచ్చగొట్టిన వారెవరూ ఎన్నికల్లో పోటీ చేయకుండా చూడటం దాని ఉద్దేశం. ఆ చట్టం కిందనే ట్రంప్‌కు కొలరాడో కోర్టు శిక్ష విధించింది. అమెరికా చరిత్రలో ఒక మాజీ అధ్యక్షునిపై ఈ చట్టాన్ని ప్రయోగించడం బహుశా ఇదే ప్రథమం. వచ్చే ఏడాది జరుగనున్న అధ్యక్ష ఎన్నికల్లో ఈ తీర్పు ప్రభావం చాలానే ఉంటుందని చెప్పవచ్చు. ఇతర కేసుల్లోనూ ఈ తరహా తీర్పులే వస్తే ట్రంప్ రాజకీయ భవిష్యత్తు సమాధి అవుతుందనే మాటలూ వినిపిస్తున్నాయి. అయితే అంతటితో కథ అయిపోయినట్టుగా భావించడానికి వీల్లేదు. ఈ కేసు అంతిమంగా అమెరికా సుప్రీంకోర్టులోనే తేలాల్సి ఉన్నది. ఆ కోర్టులో ట్రంప్ అనుకూల న్యాయమూర్తులదే ఆధిక్యత అంటున్నారు.

కొలరాడో కోర్టు తీర్పుపై ట్రంప్ స్పందన విస్మయం కలిగిస్తున్నది. నియంతృత్వాలు ఇలాగే పుడతాయని ఆయన వ్యాఖ్యానించారు. అంటే ఒకవేళ అన్ని అడ్డంకులు తొలగిపోయి తాను గెలిస్తే నిరంకుశంగా పాలిస్తానని చెప్పకనే చెప్తున్నారాయన. ట్రంప్ స్పందన ఆయన తిరుగుబాటు కుట్రదారు అని తెలియజేస్తున్నదని అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ట్రంప్ భవితవ్యం కోర్టుల్లో తేలుతుందా లేక ప్రజా క్షేత్రంలోనే తేలుతుందా అనేది ఉత్కంఠభరితమైన ప్రశ్న.

# హామీలపై పాట్లు.. అప్పులపై ఫీట్లు

అమెరికా ప్రపంచంలోకెల్లా సంపన్న దేశం. ఎక్కువ అప్పులు ఉన్నది అమెరికాకే. అప్పులు చేయడం తప్పు కాదు. అయితే అప్పులు దేని కోసం చేశారనేది ముఖ్యం. దేశాలకైనా, సంస్థలకైనా, వ్యక్తులకైనా అప్పులు సహజం. దేశంలోనైనా, రాష్ర్టాల్లోనైనా ప్రభుత్వాలు మారగానే ఆర్థిక పరిస్థితిపై తప్పనిసరిగా చర్చ జరుగుతుంది. ఒక్క మన రాష్ట్రమనే కాదు.. అనేక రాష్ర్టాల్లో ఇదే పరిస్థితి. ఏపీలో టీడీపీ ఓడిపోయి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు ఖజానాలో కేవలం రూ.వంద కోట్లు మాత్రమే ఉంచి వెళ్లారనేది విమర్శ.



బుద్ధా మురళి

ప్రభుత్వం అనేది రిజర్వ్ బ్యాంకు కాదు, అక్కడేమీ కరెన్సీ ప్రింట్ చేయరు. నోట్ల కట్టలుండవు. పన్నులు, ఇతర రూపాల్లో ఒకవైపు ఆదాయం వస్తుంటుంది. మరోవైపు వాటిని వ్యయం చేస్తుంటారు. అంతే తప్ప ఏ ప్రభుత్వం వద్ద కూడా వేల కోట్ల నిధులు ఉండవు. అప్పటివరకు ఉన్న ప్రభుత్వం తప్పు చేసింది, మేం వాటిని సరిదిద్దుతాము అని చెప్పుకోవడానికి కొత్తగా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్థిక వ్యవహారాలు, అప్పులు వెల్లడించడం సహజం. అప్పట్లో పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ చేసిన ఆర్థిక సంస్కరణల కారణంగా ఈ రోజు మన దేశం ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రపంచంలో తలెత్తుకొని నిల్చున్నది. అయినా గత పాలకులు దేశాన్ని ఆర్థికంగా నిర్వీర్యం చేస్తే తాను గట్టెక్కించినట్టు ప్రధాని మోదీ ఇప్పటికీ చెప్పుకొంటారు. బంగారాన్ని విమానంలో తరలించి అప్పు పొందిన దశ నుంచి మూడున్నర దశాబ్దాల్లో దేశం ఆర్థికంగా ఇంత బలోపేతం అవుతుంది అని ఎవరూ ఊహించలేదు. చాలామంది మేధావులు సైతం ఆ రోజుల్లో ఆర్థిక సంస్కరణలను వ్యతిరేకించారు. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం ఎదగడానికి ఆనాటి సంస్కరణలు దోహదం చేశాయి. అయితే నాటి పాలకుల కృషిని నేటి ప్రభుత్వాలు గుర్తించడానికి ఇష్టపడవు. అది సహజం. అదే రాజకీయం.

> ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య ఆర్థికమంత్రి అయిన అనంతర రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి శాసనసభలో తేటతెల్లం చేశారు. అంతకుముందు ఆర్థిక వ్యవహారాలు బయటకు వచ్చేవి కావు. 'ఇలాంటి ఆర్థికస్థితిలో రాష్ర్టాన్ని అప్పగించారు. మా తలపై ఎంతటి భారం ఉందో చూడండి' అని ప్రజలకు చెప్పాలనే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఆయన అలా చేశారు.

పదేండ్ల టీఆర్ఎస్ (బీఆర్ఎస్) పాలన తర్వాత ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాజకీయ వ్యూహంలో భాగంగానే శాసనసభలో ఆర్థిక స్థితిపై చర్చకు శ్రీకారం చుట్టింది. కుటుంబ పెద్ద ఆదాయం ఎంతో తెలిస్తేనే కదా? ఆ కుటుంబం ఏ ఖర్చును ఎంత వరకు భరిస్తుందో అంచనా వేసుకునేది. రాష్ట్ర రుణం రూ.6.71 లక్షల కోట్లకు చేరిందని, రాష్ట్రంలో



ఆర్థిక సంక్షోభం తలెత్తిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో కుటుంబంపై రూ.7 లక్షల రుణ భారం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విచారం వ్యక్తం చేశారు.

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈ అప్పుల గురించి ఇప్పుడే తెలిసిందా? గత పదేండ్ల నుంచి వాళ్లు అసెంబ్లీకి రావడం లేదా? పదేండ్లలో బడ్జెట్ ప్రవేశపెట్టలేదా? కాగ్ రిపోర్టులు ఇవ్వలేదా? ఆర్‌బీఐ తెలంగాణ వివరాలు ఇవ్వడం లేదా? నిజంగా ఇలా జరిగి ఉంటే ఈ అప్పుల గురించి కాంగ్రెస్ నాయకులకు తెలిసే అవకాశం లేదు. అధికారంలోకి రాగానే ఖజానా తెరిచి చూస్తే అప్పుడే అప్పుల గురించి తెలిసింది అంటే నమ్మవచ్చు. కానీ అలా ఉండదు కదా? అప్పుల గురించి ఏటా బడ్జెట్లో వివరాలుంటాయి. వాటిని సభకు సమర్పిస్తారు. కొత్త ముఖ్యమంత్రి అప్పుల గురించి చెబుతూ 'ఆర్థిక సంక్షోభం' అని అన్నారు. ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితి గురించి కాంగ్రెస్ నాయకత్వానికి తెలియదా? ఆర్థిక సంక్షోభం నిజమే అనుకుందాం.. మరి ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను మించిన హామీలు ఎలా ఇచ్చారు?

సంక్షేమ పథకాల అమలుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే అదనంగా మరో లక్షా 20 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. వీటి అమలు సాధ్యం కాదు అని ఎన్నికలకు ముందే జయప్రకాశ్ నారాయణ హెచ్చరించారు. ఆరు గ్యారంటీలకు తోడు దళితబంధు రూ.12 లక్షలు, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలుకు అదనంగా లక్షా 20 వేల కోట్ల రూపాయలు కావాలి అని జయప్రకాశ్ నారాయణ లెక్కలు చెప్పారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులకు ఈ లెక్కలేవీ గుర్తుకురాలేదు.

కరోనా తర్వాత రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నది. అది తెలిసి కూడా బీఆర్ఎస్‌ను మించి కాంగ్రెస్ హామీల వర్షం కురిపించింది. బీఆర్ఎస్ రూ.2 వేల పింఛన్ ఇస్తుంటే తాము అధికారంలోకి వస్తే రూ.4 వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అలానే రూ.10 లక్షల దళిత బంధును ఎస్సీ, ఎస్టీలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటర్ చదివే విద్యార్థినులకు స్కూటీ ఇస్తామన్నారు. రైతు భరోసా కింద ఏటా రూ.5 వేలు ఇవ్వడంతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని స్థితిలో ఉంటే.. అధికారంలోకి రాగానే లక్షల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు కాంగ్రెస్ నోటిఫికేషన్ల తేదీలు కూడా ప్రకటించింది. అధికారంలో ఉన్న పార్టీ కన్నా రెట్టింపు హామీలు ఇచ్చింది. ఇది ఎలా సాధ్యం అవుతుంది అనే ఆలోచన అప్పుడు రాలేదా? లేక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధికార పక్షం కన్నా తమకే బాగా తెలుసు అనుకున్నారా? లేక ఆదాయం పెంచి చూపిస్తామనే ధీమానా?

ఆదాయం పెంచి హామీలు అమలు చేసి చూపిస్తే రాష్ర్టానికి, ప్రజలకు మంచిదే. ఈ పదేండ్లలో అప్పులు పెరిగాయి తప్ప.. అభివృద్ధి లేదనేది కాంగ్రెస్ ఆరోపణ. రాజకీయ పార్టీగా ప్రత్యర్థిపై విమర్శలు, ఆరోపణలు చేయాల్సిందే కానీ పదేండ్లలో అభివృద్ధి జరగలేదా? మార్పు లేదా? అనేది కూడా ఆలోచించాలి. పదేండ్లలో ఏం అభివృద్ధి జరిగిందనేది మన కండ్ల ముందు కనిపిస్తున్నది. దాన్ని కాదనలేం. ముఖ్యమంత్రిగా అప్పుల గురించి శాసనసభలో ఆందోళన వ్యక్తం చేసిన రేవంత్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ శాసనసభ్యునిగా ఉన్నప్పుడు ఇదే సభలో ఒక సంఘటన వివరించారు. 'నా తండ్రి చనిపోతే దహన సంస్కారాల తర్వాత స్నానం చేయడానికి చెరువులో నీళ్లు లేవు. బోరు బావి వద్ద స్నానం చేద్దాం అనుకుంటే కరెంట్ లేదు' అని పాలమూరు జిల్లాలో తాను అనుభవించిన దయనీయ స్థితిని స్వయంగా అప్పట్లో రేవంత్‌రెడ్డి వివరించారు.

> ఇప్పుడు పాలమూరు అలానే ఉందా? పచ్చని పొలాలు నిజం కాదా? వలసల జిల్లాకు పొరుగు రాష్ట్రం నుంచి కూలీలు రావడం నిజం కాదా? ఒక రాజకీయ పార్టీ ఓడిపోవడానికి, విజయం సాధించడానికి అనేక కారణాలు ఉంటాయి. అధికార పక్షం ఓడిపోయినంత మాత్రాన తెలంగాణ పదేండ్లలో ఏం సాధించలేదు అని అనేద్దామా? మహామహా నాయకులు ఉన్న నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరోసిస్‌కు బలైతే తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇంటింటికి సురక్షితమైన మంచినీళ్లు రావడం నిజం కాదా?

ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవడానికే ఆర్థిక సంక్షోభం అంటూ సాకు చెప్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. విపక్షాల విమర్శ నిజం కాదని నిరూపించాలంటే హామీలు అమలు చేసి చూపించాలి. 'ఆర్థిక సంక్షోభంలో ఉన్నాం' అని హామీల అమలును దాటవేస్తే కాంగ్రెస్ సాకులు వెతుక్కున్నట్టు అవుతుంది. ప్రజల్లో పాలకులు చులకనవుతారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల రాజకీయ ప్రయోజనాల కన్నా తెలంగాణ ప్రజల ప్రయోజనాలు ముఖ్యం. కాంగ్రెస్ హామీల అమలు మాట ఎలా ఉన్నా.. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగించడమూ కష్టమే. గత కొంతకాలం నుంచి మోదీ ప్రభుత్వం తెలంగాణపై కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్నది. బీఆర్ఎస్ ఉన్నప్పుడే కేంద్ర తీరు అలా అంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రేమ చూపుతారనుకోవడం అత్యాశే.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆర్థికంగా అండగా నిలువగల స్థాయిలో ఉన్న రాష్ర్టాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. ఇలాంటి పరిస్థితిలో 'తెలంగాణను ప్రధాని మోదీ పెద్దన్నలా ఆదుకుంటారు' అని ఆశించడం అత్యాశే. విద్యుత్తు సంస్కరణలకు అంగీకరించి వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెడితే 24 వేల కోట్ల రూపాయల అప్పు తీసుకునేందుకు అవకాశం లభిస్తుందేమో! అంతకు మించి ప్రధాని మోదీపై ఆశలు పెట్టుకోలేం. అప్పుల రాజకీయాలు ఎలా ఉన్నా తెలంగాణలోని రాజకీయపక్షాల లక్ష్యం తెలంగాణ మేలు కోరుకునేట్టుగా ఉండాలి.

# పెన్షనర్లకు కేంద్ర సర్కారు ధోకా

దేశ పురోభివృద్ధిలో కార్మికుల భాగస్వామ్యం గణనీయంగా ఉంటుంది. కార్మికుల శ్రమ ఫలితంగా మన దేశం పారిశ్రామిక ప్రగతి ఎంతగా సాధించిందో చూస్తూనే ఉన్నాం. కానీ, కార్మికుల కష్టానికి తగ్గ ప్రతిఫలం వారికి దక్కడం లేదు. అందుకు భిన్నంగా వారి భవిష్యత్తు ప్రయోజనాల కోసం ఉద్దేశించిన సంక్షేమ పథకాలు లోపభూయిష్టంగా తయారయ్యాయి. కాలానుగుణంగా వాటిని మెరుగుపరచకపోవడంతో అవి వారి జీవిత చరమాంకంలో కనీస అవసరాలు తీర్చలేకపోతున్నాయి. పీఎఫ్ పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం అరకొరగా పైసలు విదుల్చుతున్న సంగతి విదితమే. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్‌దారుల పట్ల చూపుతున్న నిర్లక్ష్య వైఖరే ఇందుకు ప్రధాన కారణం.



కొల్లిపర శ్రీనివాసరావు
95731 98333



**1952** నవంబర్ 1 నుంచి కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1971 మార్చి 1న అప్పటి కేంద్ర ప్రభుత్వం ఎంప్లాయీస్ ఫ్యామిలీ పింఛన్ పథకాన్ని తీసుకువచ్చింది. పదవీ విరమణ అనంతరం ఉద్యోగి తన శేష జీవితాన్ని సౌకర్యవంతంగా గడిపేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దింది. ఉద్యోగి బేసిక్ వేతనం, డీఏతో కలిపిన మొత్తానికి 2.32 శాతం కాంట్రిబ్యూషన్ మినహాయించి ఈ పథకానికి జమ చేస్తుంది. దానికి ప్రభుత్వ వాటాగా 1.16 శాతం జమచేస్తుంది. 1995 నవంబర్ 16న మరింత వెసులుబాటు కల్పిస్తూ దాని స్థానంలో ఈపీఎస్-95 పథకాన్ని తీసుకువచ్చింది. దీనిలో కాంట్రిబ్యూషన్‌ను 2.32 శాతం నుంచి 8.33 శాతానికి పెంచింది. ప్రభుత్వ వాటా గతంలో మాదిరిగా 1.16 శాతం మాత్రమే ఉండటం గమనార్హం.

ప్రభుత్వం చెల్లించే వాటాను 1.16 శాతం నుంచి 8.33 శాతానికి పెంచాలని 2013లో కోషియారి కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. తద్వారా డీఏతో కలిపి కనీస పింఛను రూ.3 వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి అందులో సూచించింది. ఆ నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను పదవీ విరమణ పొందిన ఉద్యోగులు భరించలేకపోతున్నారు. నేటికీ కనీస పింఛన్ రూ.1000, గరిష్ఠంగా రూ.3000 అందుతున్నది. 1971-75 మధ్యకాలంలో సర్వీసులో ఉన్న ఉద్యోగులను పెన్షనబుల్ సర్వీసుగా పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల వారికి భారీగా నష్టం జరుగుతున్నది.

**2023-23 వార్షిక నివేదిక ప్రకారం పింఛన్ చెల్లింపులు ఇలా..**

| (రూపాయలలో) | పింఛన్‌దారులు | |
|---|---|---|
| 1000 లోపు | 36,48,314 | (48.27 శాతం) |
| 1001-1500 | 11,73,158 | (15.52 శాతం) |
| 1501-2000 | 8,68,443 | (11.42 శాతం) |
| 2001-2500 | 8,96,660 | (11.6 శాతం) |
| 2501-3000 | 4,75,251 | (6.29 శాతం) |
| 3000-3500 | 2,27,526 | (3.01 శాతం) |
| 3500-4000 | 1,71,661 | (2.27 శాతం) |
| 4001-4500 | 67,426 | (0.89 శాతం) |
| 4501-5000 | 3,705 | (0.05 శాతం) |
| 5001-ఆపైన | 26,769 | (0.35 శాతం) |

ఫ్యామిలీ పింఛన్ స్కీం మూలధనం రూ.8419.54 కోట్లు. దీన్ని ప్రాథమిక మూలధనంగా ఈపీఎస్-95లోకి తీసుకువచ్చింది. పింఛన్‌కు అర్హత లేనివారికి వారి కాంట్రిబ్యూషన్‌కు కొంత వడ్డీ కలిపి చెల్లిస్తున్నది. తద్వారా మూలధనం 93 రెట్లు వృద్ధి సాధించి 2023 మార్చి 31నాటికి రూ.7,80,308.93 కోట్లుగా ఉన్నది. కార్మికులు చెల్లించిన కాంట్రిబ్యూషన్ మీద వచ్చిన చక్రవడ్డీలో 60 శాతం మాత్రమే పింఛన్లు, పింఛన్ అర్హతలేని వారికి చెల్లించే మొత్తం కింద వినియోగిస్తుండటం దీనికి ముఖ్య కారణం. అంటే కార్మికులు చెల్లించిన కాంట్రిబ్యూషన్ ఈపీఎఫ్‌వో దగ్గర అలాగే ఉన్నది.

2023 మార్చి 31నాటికి ఉద్యోగస్థులు చెల్లించిన కాంట్రిబ్యూషన్ రూ.4,87,066.16 కోట్లు (87.18 శాతం). ప్రభుత్వం చెల్లించిన వాటా రూ.68,350.63 (12.20 శాతం) కోట్లు. ఇతర ఆదాయం రూ.3,297.24 కోట్లు (0.62 శాతం).

> 1995 నవంబర్ 16 నుంచి 2023 మార్చి 31 వరకు చెల్లింపుల మీద వచ్చిన చక్రవడ్డీ ఎంప్లాయీస్ కాంట్రిబ్యూషన్ మీద రూ.3,77,186.39 కోట్లు (87.18 శాతం). గవర్నమెంటు కాంట్రిబ్యూషన్ మీద రూ.52,783.60 కోట్లు (12.20 శాతం). ఇతరత్రా వచ్చిన ఆదాయం మీద రూ.2,682.44 కోట్లు (0.62 శాతం). మొత్తం రూ.4,32,652.43 కోట్లు.

పింఛన్ చెల్లింపులు రూ.1,37,028.30 కోట్లు. పింఛన్ అర్హత లేని వారికి చెల్లించిన మొత్తం రూ.88,038.33 కోట్లు. మొత్తం చెల్లింపులు 2,25,066.63 కోట్లు, ఇది రూ.3,77,186.39 కోట్లలో (ఎంపాయిస్ కాంట్రిబ్యూషన్ మీద వచ్చిన వడ్డీ) 59.67 శాతం మాత్రమే. మిగిలిన 1,52,119.76 కోట్లు (40.33 శాతం) మూలధనంలో కలిపారు.

> నేషనల్ పెన్షన్ స్కీం 2004 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ స్కీంలో నెలకు రూ.15,000 లెక్క కాంట్రిబ్యూషన్ 35 ఏండ్ల పాటు కడితే రూ.63,00,000 అవుతుంది. 35 ఏండ్లకు సంవత్సరానికి 10 శాతం వడ్డీ కలిపితే చక్రవడ్డీతో సహా రూ.5,74,24.151 అవుతుంది.

ఈ మొత్తానికి ఏటా 6 శాతం చొప్పున వడ్డీకి బ్యాంకులో జమ చేస్తే నెలకు రూ.2,87,121 వస్తుంది. రూ.5,74,24,151 కాంట్రిబ్యూషన్ కట్టినవారికి చెందుతుంది. ఈపీఎస్-95 ప్రస్తుత సీలింగ్ రూ.15,000 అంటే నెలవారీ కాంట్రిబ్యూషన్ రూ.1,250 ఇది రూ.15 వేలలో 12వ వంతు. ఈ విధంగా 35 ఏండ్లు పీఎఫ్‌కు చెల్లిస్తే రూ.5,25,000 అవుతుంది. దీనికి కూడా ఏడాదికి 10 శాతం వడ్డీ కలిపితే చక్రవడ్డీతో సహా రూ.47,85,346 అవుతుంది. ఈ మొత్తం పీఎఫ్‌కు చేరుతుంది. కాంట్రిబ్యూషన్ కట్టినవారికి కేవలం రూ.7,929 నెలకు పింఛన్ వస్తుంది. (15,000/70X37 (35+2). ఎన్‌పీఎస్ ప్రకారం నెలకు రూ.23,927 పింఛన్ కింద రావాలి (2,87,121/12) కానీ, రాదు.

1995 నవంబర్ 16 నాడు ఈపీఎస్-95 పింఛన్ ప్రవేశపెట్టినప్పుడు వృద్ధుల పింఛన్ నెలకు 75 రూపాయలు ఉండేది. ఇది 2004లో రూ.200 అయ్యింది. 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత 5 రెట్లు పెరిగి రూ.1000 అయింది. తదుపరి 2018లో 2 రెట్లు పెరిగి 2,016 అయింది. అంటే 75 రెట్లు పెరిగింది.

75,58,913 పింఛన్‌దారులకు గాను 2022-23లో రూ.14,444.60 కోట్లు చెల్లించారు. అంటే సగటున నెలకు 1,592 మాత్రమే చెల్లించారు. ప్రస్తుత ఉద్యోగస్థుల పింఛన్ విధానంలో ఈపీఎస్-95 పథకానికి ఎన్‌పీఎస్ పింఛన్‌కు ఉన్న తారతమ్యం ఇది. పింఛన్ లెక్కించే విధానంలో ఈపీఎస్-95 కింద పనిచేసి రిటైరైన పబ్లిక్ సెక్టారు, ప్రైవేటు సెక్టారు ఉద్యోగులకు, ప్రభుత్వరంగంలో రిటైరైన ఉద్యోగులకు ఇంత తేడా ఎందుకు ఉండాలి? దేశాభివృద్ధిలో వీరిరువురికి సమాన ప్రాతినిధ్యం ఉన్నది. అలాంటప్పుడు ఈ వివక్ష ఎందుకు ఉండాలి? అనడిగితే వీటికి సమాధానం ఉండదు.

దేశంలో కనీస పింఛన్ పెంపు కోసం నిరీక్షిస్తూ 70 ఏండ్లు ఆపైబడిన వారు, వృద్ధులు, హయ్యర్ ఆప్షన్‌కు నోచుకోనివారు 80 శాతం మంది ఉన్నారు. వారి కనీస పింఛన్ 7500, డీఏతో కలిపి ఇవ్వవలసినదిగా దాదాపు ఆరేండ్లుగా ప్రభుత్వానికి నిరసనల ద్వారా తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ఈపీఎస్-95 పథకాన్ని సమూలంగా సరిదిద్దాలి. లేకుంటే రాజ్యాంగ విలువలను సంరక్షించే విధంగా న్యాయవ్యవస్థ కలుగజేసుకోవాలి. ప్రాథమిక హక్కులకు భంగం లేకుండా సంఘంలో గౌరవప్రదంగా జీవించడానికి వారికి సాంఘిక భద్రత, ఆర్థిక భద్రత కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

అక్షర జ్ఞానానికి ఆమడదూరంలోనే ఉండిపోయిన ఆదివాసులు అందలం ఎక్కేందుకు తొవ్వ దొరికింది. విజ్ఞాన సముపార్జన దిశగా మరింత వేగంగా అడుగులు వేసేందుకు మార్గం సుగమమైంది. విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కేంద్రీయ గిరిజన వర్సిటీ ఏర్పాటుకు భారత ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆదివాసీల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారక్క పేరిట ములుగు జిల్లాలో ఈ జాతీయస్థాయి విశ్వవిద్యాలయాన్ని కేంద్రం నెలకొల్పనున్నది.

# అడవి బిడ్డల అక్షరయాత్రకు నాందీగీతం



ఆరుట్ల నరేశ్
94409 91345



గిరిజన వర్సిటీకి సంబంధించిన బిల్లు పార్లమెంట్‌లోని ఉభయసభల్లో పాస్ అవగా, రాష్ట్రపతి ఆమోదం కోసం పంపారు. ములుగు జిల్లా కేంద్రంలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన బిల్లును తొలుత లోక్‌సభలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రవేశపెట్టారు. ఈ యూనివర్సిటీ పేరును కేంద్ర విశ్వవిద్యాలయాల జాబితాలో చేర్చుతూ ఇప్పటిదాకా ఉన్న చట్టానికి సవరణ చేయాలని ప్రతిపాదించారు. 2009 సెంట్రల్ యూనివర్సిటీల చట్టాన్ని సవరించి సమ్మక్క-సారక్క విశ్వవిద్యాలయాన్ని అందులో చేర్చనున్నట్టు బిల్లులో పేర్కొన్నారు.

> ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ వేరుపడ్డ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం పేరు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014. ఆ చట్టంలో పొందుపర్చిన హామీల్లో ఉభయ రాష్ర్టాల్లో గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటు అంశం ఒకటి. ఆ చట్టాన్ని అనుసరించి కేంద్ర సర్కారు.. ఏపీలో 2019లోనే గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పింది. ఇటు తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయ ఏర్పాటు అంశాన్ని మాత్రం నిర్లక్ష్యం చేసింది.

రాష్ట్రంలో ఇప్పటికే కొనసాగుతున్న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) స్థాయిలో సమ్మక్క-సారక్క యూనివర్సిటీని నెలకొల్పేలా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందినప్పటికీ కేంద్రం ఇన్నేండ్లు తాత్సారం చేస్తూ వచ్చింది. భావి తరాలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సర్కారు ప్రణాళికలు రూపొందించగా.. గిరిజన విశ్వవిద్యాలయం నెలకొల్పేందుకు అవసరమైన ఏర్పాట్లు, డీపీఆర్ రూపొందించే బాధ్యతను కేంద్రం హెచ్‌సీయూకు అప్పగించింది. విద్యార్థులు, ఉపన్యాసకుల నిష్పత్తి, భవనాల నిర్మాణం, మౌలిక వసతులు తదితర అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న హెచ్‌సీయూ మొత్తం రూ.1200 కోట్ల అంచనాలతో నివేదికను కేంద్రానికి సమర్పించింది. ములుగు జిల్లా జాకారంలోని యువజన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడ తాత్కాలిక తరగతులు ప్రారంభించేందుకు అనుకూలంగా ఉన్నదని తెలిపింది. అలా 2019లోనే తరగతులు ప్రారంభమవుతాయని గిరిజన సంక్షేమ యంత్రాంగం భావించినప్పటికీ వివిధ కారణాల దృష్ట్యా వాయిదా పడుతూ వచ్చింది. సాంకేతిక కారణాల నేపథ్యంలో కేటాయించిన నిధుల బదిలీ, సదరు భూములకు పరిహారం చెల్లించడంలో తీవ్ర జాప్యం జరిగింది.

సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ ఏర్పాటు కోసం ఎన్నో పోరాటాలు జరిగాయి. ముఖ్యంగా స్థానిక ప్రభుత్వంగానే కాక, పార్టీపరంగా బీఆర్ఎస్ చేసిన అలుపెరుగని పోరాటం మరువలేనిది. ములుగు జిల్లా జాకారం గట్టమ్మ ఆలయ సమీపంలో 335.04 ఎకరాల భూములను వర్సిటీ కోసం కేటాయించిన ఫైళ్లను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రానికి పంపడమేకాక అనేకసార్లు విజ్ఞప్తి చేశారు కూడా. ప్రధాని మోదీకి స్వయంగా వినతిపత్రం ఇచ్చారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం నేతృత్వంలోని అధికారుల బృందం ములుగు గట్టమ్మ ప్రాంతంలో భూములను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర బృందంతో మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి సమావేశమై చర్చించారు. పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ ఎంపీలు ఈ అంశాన్ని లేవనెత్తారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండాకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ తరపున విన్నపాలు అందాయి. గిరిజన పరిశోధన సంస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వంటి వివిధ పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లోనూ రాష్ట్ర మంత్రులు వర్సిటీ ఆకాంక్ష గురించి వినిపించారు. గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, వామపక్ష పార్టీల నేతల ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. విద్యార్థులు పీఎం మోదీ పేరుతో పోస్ట్ కార్డులు పంపారు.

> హెచ్‌సీయూ స్థాయిలో రెండు దశల్లో నెలకొల్పనున్న ఈ వర్సిటీ కోసం కేంద్ర ప్రభుత్వం రానున్న ఏడేండ్ల కాలంలో మొత్తం రూ.889.07 కోట్లను వెచ్చించనున్నది. దశాబ్ది కాలంగా ఎదురుచూస్తున్న గిరిజన విశ్వవిద్యాలయం ఎట్టకేలకు సాకారమవుతున్న దరిమిలా తమ జాతిలో విద్యా విప్లవం రానున్నదన్న ఆనందోత్సాహాలు అడవి బిడ్డల్లో కనిపిస్తున్నాయి.

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్టుగానే స్థానిక కోటా కింద కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక రిజర్వేషన్లు అమలుచేయడం.. గిరిజన బిడ్డలకు కలిసొచ్చే అంశమే. ఆదివాసీ గిరిజన కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు, జీవనశైలి, ఆదివాసుల చరిత్రపై లోతైన పరిశోధనలకు ఈ యూనివర్సిటీ వేదిక కానున్నది. అయితే, ఆధునిక కోర్సులతోపాటు గిరిజన ఆచారాల కేంద్రీకృత విద్య, పరిశోధనలను ప్రోత్సహించేలా పలు ప్రత్యేక కోర్సులు నిర్వహించనున్న ఈ వర్సిటీలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష విధానాన్ని అనుసరిస్తామని చెప్తున్న కేంద్రం ఆదివాసీలు, గిరిజన యువతకు ప్రత్యేక కోటాలో ప్రవేశాలు కల్పించే విషయంలో సుముఖంగా లేకపోవడం ఆ తెగల్లో నైరాశ్యం నింపే ముచ్చటే.